# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 29-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ మొంథా తుఫాను కారణంగా రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ తుఫాను ప్రభావిత ప్రాంతాలలో త్వరితగతిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.
- ❖ రాష్ట్రంలో రానున్న 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని మంత్రి నారా లోకేష్ సూచించారు.
- ❖ మొంథా తుఫాను గడిచిన ఆరు గంటల్లో ఉత్తర వాయువ్య దిశగా కదిలి, తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

==================

మొంథా తుఫాను వల్ల రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో ఏరియల్ సర్వేని ముఖ్యమంత్రి ఈ రోజు నిర్వహించారు. తుఫాను తాకిడికి దెబ్బ తిన్న ప్రాంతాలను గగనతలం నుంచి పరిశీలించారు. అనంతరం డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఓడలరేవులో తుఫాను బాధితులను ఆయన పరామర్శించారు. నిత్యావసరాలతో పాటు 3 వేల రూపాయల ఆర్థిక సహాయం వారికి అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తుఫాను విషయంలో ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రాణ నష్టం జరుగకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో వరి, ఆక్వా, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని చెప్పారు. ఆస్తి నష్టంపై కేంద్ర ప్రభుత్వానికి నివేదిక ఇస్తామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 36 సెకన్లు)

==================

తుఫాను ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితి అదుపులోకి వస్తున్నందున విద్యుత్‌ను పునరుద్ధరిస్తున్నామని రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మచిలీపట్నంలో విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి ఈ రోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారీ వర్షం, గాలులు ఉండటంతో ముందస్తు చర్యలుగా అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేశామని చెప్పారు. ఈదురుగాలులతో చాలా చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని తెలిపారు. అలాగే కొన్ని విద్యుత్ సబ్‌స్టేషన్లలో కూడా వర్షపు నీరు చేరిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=================

రాష్ట్రంలో రానున్న 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. మొంథా తుఫాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి టెలీకాన్ఫరెన్స్ ను మంత్రి ఈ రోజు నిర్వహించారు. హోం మంత్రి వంగలపూడి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తదితరులు ఈ టెలి కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోయిన బురదను తొలగించేందుకు అగ్నిమాపక శాఖ తగిన చర్యలు చేపట్టాలన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో గృహాలు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ ను పునరుద్ధరించాలని తెలిపారు. దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటూ పంట నష్టం అంచనాలను రూపొందించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు.

=================

మొంథా తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు నిత్యావసర సరకులను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతి కుటుంబానికి 25 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, లీటర్ వంటనూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు, కిలో చక్కెర పంపిణీ చేయాలని పేర్కొంది. పంపిణీకి వెంటనే చర్యలు ప్రారంభించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అలాగే, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, ఇతర కూరగాయల సరఫరా బాధ్యతలను మార్కెటింగ్ కమిషనర్‌కు అప్పగించింది. వీటితో పాటుగా బాధితులు ఒక్కొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని సూచించింది.

విరామం

=================

తుఫాను బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలో మంత్రి ఈ రోజు పర్యటించారు. ఎర్రకాలువ ఉధృతిని స్వయంగా పరిశీలించారు. స్థానిక రైతాంగంతో మాట్లాడి పంట నష్టానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎర్రకాలువ ముంపునకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. నిడదవోలు మండలంలో 17 వేల 500 ఎకరాలకు గానూ 6 వేల ఎకరాల్లో పంట నష్టం చేకూరిందని అధికారులు మంత్రికి వివరించారు.

=================

తుఫాను అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై విశాఖ జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, జోనల్ అధికారులు, రెవెన్యూ అధికారులతో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ని ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా చేపట్టవలసిన సహాయక చర్యలు, పారిశుధ్య పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. తుఫాను నష్టాలను జాగ్రత్తగా అంచనా వేయాలని కలెక్టర్ ఆదేశించారు.

=================

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివస్ ను నిర్వహించనున్నట్లు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసులు తెలిపారు. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా ఈ నెల 31న నెల్లూరు లోనూ, నవంబర్ 7న కావలి పట్టణంలో పాదయాత్రలు నిర్వహిస్తామని వెల్లడించారు. నెల్లూరులోని వి.ఆర్.సి. సెంటర్ నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వరకు పాదయాత్ర జరుగుతుందని.. ఇందులో విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యతా సూత్రాలను పాటించడం ద్వారా దేశాభివృద్ధికి యువత కృషి చేయాలన్నారు.

==================

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో తుఫాను నష్ట నివారణ చర్యలపై రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ఈరోజు నిర్వహించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పరిస్థితులను చక్కదిద్దాలని అధికారులను ఆదేశించారు. విరిగిపడిన చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన చోట వెంటనే పునరుద్ధరించాలని చెప్పారు. డ్రోన్ల ద్వారా పాడైన రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయాలని తెలిపారు. తాగునీరు కలుషితమైతే వెంటనే ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని సూచించారు.

==================

మొంథా తుఫాను గడిచిన ఆరు గంటల్లో గంటకు 15 కిలో మీటర్ల వేగంతో ఉత్తర వాయువ్య దిశగా తెలంగాణ రాష్ట్రం వైపుగా కదులుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ తుఫాను తీవ్ర వాయుగుండంగా బలహీనపడిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో ఉత్తర కోస్తా జిల్లాలతో పాటు.. దక్షిణ కోస్తా జిల్లాలలో రాగల మూడు రోజులలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకటరావు పేర్కొంటూ...

(వాయిస్ 23 సెకన్లు)

==================

==================